జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO: APTEL/26/A7657

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 5 ॥ ఆదివారం ॥ 20-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

20 సెప్టెంబర్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:10 తిథి నవమి సా. 5:50 వరకు తరువాత దశమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పూర్వాషాఢ తె. 4:26౦ వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం సౌభాగ్య మ. 3:19 వరకు కరణం కౌలవ సా. 5:50 వరకు తైతుల ఉ. 6:59౦ వరకు వర్జ్యం మ. 12:26 నుండి మ. 2:13 వరకు దుర్ముహూర్తం సా. 4:34 నుండి సా. 5:22 వరకు రాహుకాలం సా. 4:40 నుండి సా. 6:10 వరకు యమగండం మ. 12:09 నుండి మ. 1:39 వరకు గుళికాకాలం మ. 3:10 నుండి సా. 4:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు రా. 11:11 నుండి రా. 12:59 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:33 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున



# వర్షాభావంపై సమీక్ష

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తాగునీటి సరఫరా అంశాలపై క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 513 మండలాలు వర్షాభావ ప్రభావానికి గురైనట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు.

**అక్టోబర్ 1న కరువు మండలాల ప్రకటన**

**513 మండలాల్లో కరువు ప్రాథమిక అంచనా**

**రైతులకు తక్షణ సహాయ చర్యలపై దృష్టి**

**తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు**

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

అమరావతి, సెప్టెంబర్ 19: పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు సంబంధిత నివేదికలు సిద్ధం చేసి, సెప్టెంబర్ 29న రాష్ట్ర స్థాయి కమిటీ తుది నివేదిక సమర్పించనుందని వివరించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో..



# భూస్థిర కక్ష్యలో ఈఓఎస్-05 విజయం

## నిరంతర నిఘా సామర్థ్యానికి బలం

**వ్యూహాత్మక సమాచార సేకరణలో ముందడుగు**

**అంతరిక్ష భద్రతలో భారత్ కొత్త అధ్యాయం**

**రక్షణ అవసరాలకు ఆధునిక ఉపగ్రహం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :**

భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. భూస్థిర కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన ఈఓఎస్-05 ఉపగ్రహం దేశానికి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుందని అంతర్జాతీయ విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఉపగ్రహ సాంకేతికతలో ఈ అభివృద్ధి వల్ల భారతఉపఖండం పరిధిలోని కీలక ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యం గా సంక్షోభ పరిస్థితులు, భద్రతా సవాళ్ల సమయంలో వ్యూహాత్మక సమాచారాన్ని వేగంగా సేకరించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది.

(మిగతా 2వ పేజీలో)



# ఉపాధి మేళాలో 51000 నియామక పత్రాలు

**యువతకు కేంద్రం నుంచి భారీ అవకాశాలు**

**ఉపాధి కల్పనపై ప్రధాని మోదీ దృష్టి**

**స్టార్టప్ రంగంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు**

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించడం, ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను వేగవంతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాలను నిర్వహిస్తోంది. ఈ తరువాయి 2 వ పేజీలో..



# యూపీఐ చార్జీలపై బంకుల హెచ్చరిక

**ఎన్‌పీసీఐ నిర్ణయంపై డీలర్ల ఆందోళన**

**రూ. 2,000 పైబడిన చెల్లింపులకు ప్రభావం**

**నగదు చెల్లింపులకే పరిమితమవుతామన్న సంకేతం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 15 నుంచి అమలు చేయనున్న నూతన మర్చంట్ డిస్కౌంట్ రేట్ నిబంధనలు దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకుల్లో

(మిగతా 2వ పేజీలో)



# పిఠాపురం అభివృద్ధికి పవన్ శ్రీకారం

**రూ.1,500 కోట్ల పనులకు ఏర్పాట్లు**

పిఠాపురం, సెప్టెంబర్ 19: పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రోజుల పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనలో దాదాపు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. తరువాయి 2 వ పేజీలో..



# రైతు సమస్యలపై ధర్నా నిర్వహణ

## ప్రభుత్వ వైఖరిపై ఉషశ్రీ చరణ్ విమర్శలు

పెనుకొండ, సెప్టెంబర్ 19 : రైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ నేతృత్వంలో రొద్దం మండలంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ఈ ఆందోళన చేపట్టారు. రైతు భరోసా, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సాగునీరు, వ్యవసాయ విద్యుత్, గిట్టుబాటు ధర వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ వ్యవసాయ తరువాయి 2 వ పేజీలో...

# హామీలు మరిచిన కూటమి ప్రభుత్వం

**పేర్ని నాని తీవ్ర ఆరోపణలు**



విజయవాడ, సెప్టెంబర్ 19 : అధికారంలోకి రావడానికి ఎన్నికల సమయం లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు భారీ హామీలు ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు వాటిని అమలు చేయడం లో విఫలమైందని తరువాయి 2 వ పేజీలో...



# ప్రజలతో మమేకమైన మంత్రి పార్థసారథి

**మహిళా కూలీల సమస్యలపై ఆరా**

**ప్రజా సమస్యల పరిష్కారానికి హామీ**

నూజివీడు, సెప్టెంబర్ 19:ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. మార్గమధ్యంలో పనికి ఆహార పథకం కింద పనిచేస్తున్న మహిళా కూలీలను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పనుల నిర్వహణ, అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై వారితో మాట్లాడారు. మహిళా కూలీలు తమకు ఎదురవుతున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటిని శ్రద్ధగా విన్న మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల తరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

మేషం: భాగస్వామ్య వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఉంటాయి. దూరప్రయాణాల వలన తగిన విశ్రాంతి ఉండదు. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

వృషభం: నూతన వాహన సౌఖ్యం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో విందువినోదాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మిథునం: చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న పనులు పూర్తి చేయలేరు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృథా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో మీ కష్టం ఫలించదు.

కర్కాటకం: ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ముఖ్యమైన కార్యక్రమాలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు లాభసాటిగా సాగుతాయి. బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తుంది. సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు.

సింహం: ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. విద్యా విషయాలు సంతృప్తికరంగా ఉంటాయి. సోదరులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట బాధ్యతలు భారంగా మారతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి.

తుల: ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. బంధువర్గం వారితో అకారణ వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. కొన్ని పనులలో రెండు రకములైన ఆలోచనలతో నష్టాలు తప్పవు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. వాహన కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

ధనస్సు: నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి స్నేహితుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

మకరం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. మానసిక సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కుంభం: ఒక విషయంలో బంధువర్గం నుండి విమర్శలు తప్పవు. ఇతరులపై మీ అభిప్రాయాన్ని మార్చుకోవడం మంచిది. కొన్ని వ్యవహారాలలో మీ అంచనాలు తప్పుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

మీనం: నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో మీ సేవలకు గుర్తింపు పొందుతారు. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.



# ఉపాధి మేళాలో 51000నియామక పత్రాలు

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ భారత యువత ప్రతిభ, నైపుణ్యాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని సంపాదించాయని అన్నారు. భారత యువ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, నైపుణ్యం కలిగిన యువశక్తిపై ప్రపంచ దేశాలు ఆశలు పెట్టుకున్నాయని పేర్కొన్నారు. విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన, వ్యాపార రంగాల్లో భారత యువత విశేష కృషి చేస్తోందని తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు యువతకు కొత్త అవకాశాల ద్వారాలను తెరుస్తున్నాయని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందాల ద్వారా కొత్త మార్కెట్లు, వ్యాపార భాగస్వామ్యాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు లభించడంతో పాటు యువతకు కొత్త ఉద్యోగాలు, వృత్తి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ పాత్ర మరింత బలపడుతోందని అన్నారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఎదిగిందని ప్రధానమంత్రి వెల్లడించారు. స్టార్టప్‌ల అభివృద్ధి ఇకపై కేవలం మహానగరాలకు మాత్రమే పరిమితం కాలేదని, దేశంలోని రెండో, మూడో శ్రేణి నగరాల్లో కూడా స్టార్టప్ సంస్కృతి వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన స్టార్టప్‌లో దాదాపు సగం వాటా ఈ నగరాల నుంచే వస్తోందని వివరించారు. డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, యువ పారిశ్రామికవేత్తలకు అందుతున్న సహకారం దేశంలో ఉపాధి అవకాశాలను మరింత పెంచుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

# యూపీఐ చార్జీలపై బంకుల హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. కొత్త విధానం ప్రకారం రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధన యూపీఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి 0.4 శాతం ఎమ్‌డీఆర్ వసూలు చేయనున్నారు. అయితే రూ. 2,000 లోపు జరిగే లావాదేవీలకు ఎలాంటి చార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే పెట్రోల్ బంకుల నిర్వహణ వ్యయాలు మరింత పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ నిర్ణయంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్, ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు రోజువారీగా యూపీఐ ద్వారా ఇంధన కొనుగోళ్లు చేస్తున్న నేపథ్యంలో కొత్త చార్జీల భారం పూర్తిగా డీలర్లపైనే పడుతుందని ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్న సమయంలో అదనపు వ్యయాలు విధించడం సరైన చర్య కాదని వారు అభిప్రాయపడ్డారు. పెట్రోల్, డీజిల్ విక్రయాలపై డీలర్లకు లభించే కమిషన్ చాలా పరిమితంగా ఉంటుందని సంఘాలు గుర్తుచేశాయి. లీటరుకు కేవలం రూ. 2.40 నుంచి రూ. 3.40 వరకు మాత్రమే మార్జిన్ లభిస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి పెద్ద యూపీఐ లావాదేవీపై 0.4 శాతం చెల్లించాల్సి వస్తే లాభాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించాయి. ముఖ్యంగా భారీ పరిమాణంలో ఇంధనం కొనుగోలు చేసే వినియోగదారుల లావాదేవీల వల్ల అదనపు ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇంధనం అత్యవసర అవసరాలకు సంబంధించిన కీలక సరుకుగా పరిగణించబడుతున్నందున పెట్రోల్ బంకులను ఎమ్‌డీఆర్ పరిధి నుంచి పూర్తిగా మినహాయించాలని డీలర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇతర అవసరమైన సేవల మాదిరిగానే ఇంధన విక్రయాలను కూడా ప్రత్యేక విభాగంగా పరిగణించి డిజిటల్ చెల్లింపులపై అదనపు భారాన్ని తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. లేకపోతే చిన్న వ్యాపారుల ఆర్థిక స్థితి మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల విస్తరణలో పెట్రోల్ బంకులు కీలక పాత్ర పోషించాయని నిర్వాహకులు గుర్తుచేస్తున్నారు.

# హామీలు మరిచిన ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టకుండా పాలకులు తమ బాధ్యతలను విస్మరించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతాంగం ప్రస్తుతం తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోందని పేర్ని నాని అన్నారు. సాగునీటి కొరత, వర్షాభావ పరిస్థితులు, పంటల నష్టం వంటి సమస్యలతో రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన సమయంలో రైతుల సమస్యలను పక్కనబెట్టడం బాధాకరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు ప్రజల్లో భారీ ఆశలు కలిగించాయని, అయితే వాటి అమలు విషయంలో స్పష్టత కనిపించడం లేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కంటే మెరుగైన పథకాలు అందిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ హామీలను నిలబెట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రజలకు ప్రకటించిన పథకాలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయనే అభిప్రాయం రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా అనేక వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్ని నాని అన్నారు.

# వర్షాభావంపై సమీక్ష

మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఉద్యాన పంటల సంరక్షణ కోసం ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించినట్లు పేర్కొంటూ, ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, మద్దతు చర్యలు వేగంగా అందించాలని సూచించారు. కరువు పరిస్థితుల కారణంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేశారు. బోర్లపై ఆధారపడే ప్రాంతాల్లో అవసరమైతే అదనపు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

విశాఖపట్నంలో భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి అవసరమైన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నగర తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

# ప్రజలతో మమేకమైన మంత్రి పార్థసారథి

మొదటి పేజీ తరువాయి

ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా మంత్రి స్థానికంగా ఉన్న టీ సెంటర్ వద్ద కొంతసేపు ఆగి గ్రామస్థులతో మాట్లాడారు. సాధారణ ప్రజల మధ్య కూర్చొని వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజలు చేసిన సూచనలను ఆయన ఆసక్తిగా విన్నారు. గ్రామంలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై స్థానికులు మంత్రికి వివరించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు.

ప్రభుత్వం ప్రజా పాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపు కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడడం ద్వారా వారి అవసరాలను మరింత సమర్థంగా గుర్తించగలుగుతున్నామని చెప్పారు. పర్యటన సందర్భంగా గ్రామస్థులు మంత్రిని కలుసుకుని తమ సమస్యలను వినిపించారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

# రైతు సమస్యలపై ధర్నా నిర్వహణ

మొదటి పేజీ తరువాయి

రంగానికి విద్యుత్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పంటలకు అవసరమైన సమయంలో సరిపడా విద్యుత్ అందకపోతే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల సాగులో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులకు విద్యుత్ సమస్యలు మరింత భారంగా మారుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు.

పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం వంటి సహాయాలను అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో అందించాలని కోరారు. గతంలో రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రైతులకు మద్దతు లభించిందని గుర్తుచేస్తూ ప్రస్తుతం కూడా అదే స్థాయిలో సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆమె కోరారు. పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని సూచించారు.

# భూస్థిర కక్ష్యలో ఈఓఎస్-05 విజయం

(మొదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలోకి విజయ వంతంగా ప్రవేశపెట్టారు. భూమికి సుమారు 34,900 నుంచి 35,900 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఈ కక్ష్యలో ఉపగ్రహం భూమి భ్రమణ వేగానికి అనుగుణంగా కదులుతుంది. దీంతో ఒకే ప్రాంతాన్ని నిరంతరంగా గమనించే అవకాశం లభిస్తుంది. గతంలో ఉపయోగిస్తున్న దిగువ భూకక్ష్య ఉపగ్రహాల కంటే ఇది భిన్నమైన ప్రయోజనాన్ని అందిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈఓఎస్-05 దేశానికి వ్యూహాత్మక సమాచారాన్ని అందించే తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా నిలుస్తుందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాలు, సముద్ర జలాలు, కీలక రక్షణ స్థావరాల పరిసరాల్లో జరిగే కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. నిరంతర పరిశీలన ద్వారా భద్రతా వ్యవస్థలకు సమయానుకూల సమాచారం అందే అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. భారత్ ఇప్పటికే పలు నిఘా ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో నిర్వహిస్తోంది. అవి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందించినప్పటికీ ఒక ప్రాంతాన్ని నిరంతరం గమనించే సామర్థ్యం పరిమితంగానే ఉంటుంది.

ఉపగ్రహాలు భూమి చుట్టూ వేగంగా తిరుగుతుండటంతో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కదిలిపోతాయి. ఈ నేపథ్యంలో భూస్థిర కక్ష్యలో ఉన్న ఈఓఎస్-05 నిరంతర పర్యవేక్షణకు అనుకూలంగా మారింది. దీనివల్ల గతంలో ఉన్న పరిమితులు గణనీయంగా తగ్గనున్నాయి. సైనిక మరియు వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా ఈ ఉపగ్రహం ప్రాధాన్యం మరింత పెరిగింది. లక్ష్యాలను గుర్తించిన తర్వాత వాటి కదలికలను నిరంతరం గమనించే అవకాశం ఉండటంతో నిర్ణయాలు వేగంగా తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. భద్రతా సంస్థలకు సమయానుకూల సమాచారం అందించడం ద్వారా సమన్వయం మెరుగుపడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆధునిక నిఘా వ్యవస్థల్లో నిరంతర సమాచార ప్రవాహం అత్యంత కీలక అంశంగా భావిస్తున్నారు. అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ ముందుకు సాగుతోంది. 2024లో కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించిన స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్-3 కార్యక్రమం కింద 52 రక్షణ ఉపగ్రహాలను అభివృద్ధి చేయాలని నిర్ణయిం చారు.

# పిఠాపురం అభివృద్ధికి పవన్ శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతులు, రవాణా సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు కీలక కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

పర్యటన తొలి రోజున ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని 52 ఆవాసాలకు చెందిన సుమారు 97 వేల మందికి తాగునీటి సరఫరాను మెరుగుపరిచే నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రజలకు అంకితం చేయనున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం కాలక్రమేణా సామర్థ్యం కోల్పోవడంతో ఆధునీకరణ పనులు చేపట్టారు. రూ.9.59 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమం పూర్తికావడంతో చివరి గ్రామాల వరకు తాగునీరు అందే పరిస్థితులు ఏర్పడనున్నాయి. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరత సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పిఠాపురం పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాటు చేసిన "పీఠికాపుర వనం"ను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విశ్రాంతి వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. అలాగే చందుర్తి-తాటిపర్తి బీటీ రహదారి, ఎఫ్.కె. పాలెం మైసమ్మ చెరువు సుందరీకరణ పనులను కూడా ప్రారంభించనున్నారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు రవాణా, వినోదం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి. రెండో రోజు నిర్వహించే బహిరంగ సభలో భారీ స్థాయిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. రూ.307 కోట్ల వ్యయంతో బహుళ గ్రామాల తాగునీటి పథకం, రూ.200 కోట్లతో పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ.80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, అమృత్ పథకం కింద మున్సిపాలిటీ తాగునీటి పనులు, రూ.100 కోట్లతో రహదారి నిర్మాణాలు చేపట్టనున్నారు.

శ్వేత

# సంపాదకీయం

**ఆదివారం 20-9-2026**

## ప్రయాణికుల రక్షణలో కీలక పాత్ర

రైల్వే రక్షణ దళ స్థాపన దినోత్సవం భారత రైల్వే భద్రతా వ్యవస్థలో ఒక ముఖ్యమైన సందర్భంగా గుర్తింపు పొందింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రయాణికులు ఆధారపడే రైల్వే వ్యవస్థను రక్షించడంలో రైల్వే రక్షణ దళం కీలక బాధ్యతలు నిర్వహిస్తోంది. రైల్వే ఆస్తుల సంరక్షణ, ప్రయాణికుల భద్రత, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టడం వంటి అనేక బాధ్యతలను ఈ దళం సమర్థవంతంగా నిర్వర్తిస్తోంది. భారత రైల్వేలకు భద్రతా కవచంలా నిలుస్తున్న ఈ దళం సేవలను గుర్తుచేసుకునే రోజుగా ఈ దినోత్సవం నిర్వహించబడుతోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థలో ఒకటి. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు వేలాది రైళ్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఇంత విస్తృతమైన వ్యవస్థను సురక్షితంగా నిర్వహించడం ఒక పెద్ద సవాలు. ఈ బాధ్యతలో రైల్వే రక్షణ దళం కీలక పాత్ర పోషిస్తోంది. రైల్వే స్టేషన్లు, యార్డులు, వంతెనలు, పట్టాలు, ఇతర మౌలిక వసతుల భద్రతను పర్యవేక్షిస్తూ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోంది.

ప్రయాణికుల భద్రత రైల్వే రక్షణ దళం ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. రైళ్లలో చోరీలు, దోపిడీలు, వేధింపులు, అక్రమ రవాణా వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ద్వారా ప్రయాణికులకు భరోసా కల్పిస్తోంది. రైల్వే ప్రయాణం మరింత సురక్షితంగా ఉండేందుకు ఈ దళం చేస్తున్న కృషి విశేషమైనది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో రైల్వే భద్రతా విధానాలు కూడా ఆధునికీకరణ దిశగా పయనిస్తున్నాయి. నిఘా కెమెరాలు, నియంత్రణ కేంద్రాలు, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థలు, ఆధునిక సమాచార సాంకేతిక సాధనాలను రైల్వే రక్షణ దళం వినియోగిస్తోంది. వీటి ద్వారా నేరాల నివారణతో పాటు వేగవంతమైన స్పందన సాధ్యమవుతోంది. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించడం వల్ల భద్రతా వ్యవస్థ మరింత బలోపేతమవుతోంది.

రైల్వే ఆస్తుల సంరక్షణలో కూడా ఈ దళం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. రైల్వేలకు చెందిన పరికరాలు, సరుకు రవాణా వాహనాలు, మౌలిక వసతులు దొంగతనం లేదా ధ్వంసం కాకుండా పర్యవేక్షిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సరుకు రవాణా కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేస్తోంది. రైల్వే ఆస్తుల రక్షణ ద్వారా ప్రజల ధనాన్ని కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో రైల్వే రక్షణ దళం సేవలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. వరదలు, అగ్నిప్రమాదాలు, రైలు ప్రమాదాలు వంటి సందర్భాల్లో సహాయక చర్యల్లో ముందుంటుంది. బాధితులను రక్షించడం, సహాయక బృందాలతో సమన్వయం చేయడం, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం వంటి పనులను సమర్థంగా నిర్వహిస్తుంది. ఈ సేవలు ప్రజల ప్రాణాలను కాపాడడంలో కీలకంగా నిలుస్తాయి.

దేశ భద్రతా సవాళ్లు మారుతున్న కొద్దీ రైల్వే రక్షణ దళం బాధ్యతలు కూడా విస్తరిస్తున్నాయి. ఉగ్రవాద ముప్పులు, విధ్వంసక చర్యలు, సైబర్ ఆధారిత భద్రతా సమస్యలు వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నారు. ఆధునిక భద్రతా ప్రమాణాలను అమలు చేస్తూ రైల్వే వ్యవస్థను మరింత సురక్షితంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నారు. మహిళా సిబ్బంది భాగస్వామ్యం కూడా రైల్వే రక్షణ దళంలో క్రమంగా పెరుగుతోంది. మహిళా ప్రయాణికుల భద్రత, పిల్లల రక్షణ, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో మహిళా సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా దళం మరింత బలోపేతమవుతోంది.

ప్రజల సహకారం కూడా రైల్వే భద్రతలో ముఖ్యమైన అంశం. అనుమానాస్పద ఘటనలు, వ్యక్తులు, వస్తువుల గురించి వెంటనే అధికారులకు సమాచారం అందించడం ద్వారా నేరాలను అరికట్టవచ్చు. భద్రతా నియమాలను పాటించడం, రైల్వే ఆస్తులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజలు మరియు భద్రతా సిబ్బంది కలిసి పనిచేసినప్పుడే పూర్తి స్థాయి భద్రత సాధ్యమవుతుంది. రైల్వే రక్షణ దళ స్థాపన దినోత్సవం ఈ దళం అందిస్తున్న సేవలను గుర్తు చేసుకునే సందర్భంగా నిలుస్తోంది. దేశ రైల్వే వ్యవస్థ సురక్షితంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది కృషిని ఈ రోజు స్మరించుకోవాలి. భవిష్యత్తులో సాంకేతికత, శిక్షణ, ప్రజల సహకారంతో రైల్వే భద్రతను మరింత బలోపేతం చేసి దేశ అభివృద్ధికి రైల్వే రక్షణ దళం మరింతగా దోహదపడాలని ఆకాంక్షించాలి.



## టిడ్కో కాలనీకి ప్రత్యేక బస్సు

### రవాణా సమస్యకు పరిష్కారం లభింపు.. సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే రాము

గుడివాడ, సెప్టెంబర్ 19: గుడివాడ టిడ్కో కాలనీ వాసులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. టిడ్కో కాలనీ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా గుడివాడ–టిడ్కో కాలనీ మధ్య ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ప్రత్యేక సర్వీసును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. కాలనీ ప్రజలు ఉద్యోగాలు, విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం పట్టణానికి రాకపోకలు సాగించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్థానికులతో కలిసి పాల్గొన్నారు. టిడ్కో కాలనీ నుంచి గుడివాడ ఆర్టీసీ డిపో వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకుని వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రయాణికులకు జీరో ఫేర్ టికెట్లను అందజేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల ఉచిత ప్రయాణ పథకం ప్రయోజనాలను వివరించారు. టిడ్కో కాలనీలో నివసిస్తున్న ప్రజలు చాలా కాలంగా సరైన రవాణా సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నారని స్థానికులు తెలిపారు. కాలనీ నుంచి పట్టణానికి చేరుకోవడానికి ఆటోలు, ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని వివరించారు. ఇప్పుడు ప్రత్యేక బస్సు సర్వీసు అందుబాటులోకి రావడంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని ఆనందం వ్యక్తం చేశారు. టిడ్కో కాలనీ రవాణా సమస్యపై ఇటీవల ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశం జరిగిన కేవలం రెండు రోజుల్లోనే ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభం కావడం విశేషంగా నిలిచింది. ప్రజల అవసరాలను గుర్తించి వేగంగా స్పందించిన అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలంటే ఆర్టీసీ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, వృద్ధులు, విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సేవలు నిర్వహించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ఆర్టీసీ పనిచేయాలని సూచించారు. గుడివాడ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఒక్కొక్కటిగా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. రవాణా, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు. టిడ్కో కాలనీ ప్రజలకు ఈ ప్రత్యేక బస్సు సర్వీసు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ, భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## చెరువు పరిశుభ్రతపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

### స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహణ

అనకాపల్లి, సెప్టెంబర్ 19: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలోని మునగపాక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చిలకపన్న చెరువులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలను ప్రజల్లో మరింత విస్తృతంగా అమలు చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. చెరువు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రతకు అత్యంత



ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చెరువులు, కాలువలు, ప్రజా ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామపంచాయతీ యంత్రాంగం నిరంతరం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెత్త పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజల సహకారంతో స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడంలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాల్లో వ్యర్థాల నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ, పారిశుద్ధ్య చర్యల అమలుపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులు గ్రామాలకు జీవనాధారంగా ఉండటంతో వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల పరిశుభ్రతను కాపాడటం అందరి బాధ్యత అని అన్నారు.



## యువత భవితపై అవగాహన కార్యక్రమం

### విద్యార్థులతో ఎమ్మెల్యే చరితా రెడ్డి ముచ్చట్లు

### విద్యా సంస్కరణలపై విద్యార్థులకు వివరణ

కర్నూలు, సెప్టెంబర్ 19 : కర్నూలు పట్టణంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న ఎస్వీఆర్, విజేత స్టడీ హాళ్లలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా లోకజ్ఞానం, సాధారణ పరిజ్ఞానం, క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, సామాజిక అవగాహన కూడా ఎంతో అవసరమని విద్యార్థులకు వివరించారు. అన్ని రంగాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పట్టుదల, అంకితభావం, నిరంతర సాధనతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యారంగంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు, అవకాశాల గురించి వివరించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, ఆధునిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. విద్యా రంగంలో జరుగుతున్న మార్పులు యువత భవిష్యత్తుకు ఉపయోగపడతాయని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి అధికారులు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు అవుతారని చరితా రెడ్డి అన్నారు. సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని రాష్ట్రం, దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.





# పోషణ్ మాసం 2026 మన అంగన్వాడి మన బాధ్యత

### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### ఆరోగ్యవంతమైన సమాజ నిర్మూలనకు పౌష్టికాహారం అవసరం గర్భిణీలకు శ్రీమంతం తల్లి బిడ్డ ఆరోగ్యానికి ప్రాధాన్యం

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మూలన కోసం పౌష్టికాహారం ఎంతో అవసరమని రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పోషణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ ప్రాజెక్టు బుడతనపల్లి సెక్టారు పరిధిలో ఉన్న గోడియడా గ్రామంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు శనివారం పోషణ మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం, ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన, సంవత్సరం న్నర వయస్సు దాటిన పిల్లలకు ఆరోగ్య బాలల పోటీ (వెల్ బేబీ షో) నిర్వహించడం జరిగింది. మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భిణీలకు సీమంతం వేడుక ప్రత్యేకత.. తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం సీమంతం (శ్రీమంతం) అనేది గర్భిణీ స్త్రీకి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసి ఆశీర్వాదాలు అందించే ముఖ్యమైన సంప్రదాయ వేడుకన్నారు గర్భధారణ సమయంలో తల్లి సంతోషంగా, ప్రశాంతంగా ఉండటంతో పాటు ఆమెకు అవసరమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్నాయి అన్నారు.

సీమంతం వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి గర్భిణీని ఆశీర్వదించడం ద్వారా ఆమెకు మానసిక ఆనందం, ధైర్యం కలుగుతుందని సంప్రదాయంగా నమ్ముతారు. ముఖ్యంగా గర్భిణీ ఒత్తిడి, ఆందోళన తగ్గి సంతోషంగా ఉండేందుకు కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత దోహదపడతాయన్నారు తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించబడుతుందని ఇది లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆరు నెలలు నిండిన వెంటనే అన్నప్రాసన్న చేయడం వలన పిల్లలు పౌష్టికాహారం తిని ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అదేవిధంగా సంవత్సరం వయసుకి టీకాలన్ని పూర్తిచేసుకుని వయసుకు తగ్గ బరువు ఎత్తుతో ఆరోగ్యంగా ఉన్న బాలలకు ప్రోత్సహించడం వెల్ బేబీషో కుటుంబంలో ఉత్సాహం కలిగించే సందర్భాలని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి అక్టోబర్ 8 వ తేదీ వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసోత్సవాలు జరుగుతాయన్నారు . ఈ సందర్భంగా రాగి పిండి, మునగాకు, బాలామృతం ఉపయోగించి వంటకాలను తయారుచేసి పోషకాహార ప్రదర్శనను ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శించారు గర్భిణీ స్త్రీల శ్రీమంతం వేడుకల్లో పాల్గొని పసుపు కుంకాలు చీర గాజులు పండ్లు అందించారు ఏడు సంవత్సరాలు దాటిన పిల్లలకు అన్నప్రాసన్న కార్యక్రమాన్ని మంత్రి శ్రీనివాస్ చేతుల మీదుగా చేశారు . అంగన్వాడి చిన్నారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు

ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఉమాభారతి సెక్టర్ సూపర్వైజర్ అనురాధ బిజెపి అధ్యక్షురాలు రెడ్డి పావని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ వెంకట ప్రసాదు ఎంపిటిసి వర్రీ సన్యాసిరావు మాజీ సర్పంచ్ బొబ్బిలి రామ్ నాయుడు కొప్పల వెలమ డైరెక్టర్ విజయకుమార్ ఎంపీడీవో రమణమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు

# బొగ్గు వెలుకతీత పనులకు రిలయన్స్ కంపెనీ



ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో భూగర్భంలో ఉన్న బొగ్గు వెలుకతీత పనులకు రిలయన్స్ కంపెనీ పూనుకుంటున్నదని సిపిఐ జిల్లా కార్యదర్శ మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. బొగ్గు వెలుకతీతపై రైతులలో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలు గురించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసం ఈనెల 20వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తదితర నాయకులు పాల్గొంటున్నారు. రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలుపవలసిందిగా ఆయన కోరారు.




# పి.జి. లా కాలేజీలో శ్రీమతి ఎ. శ్రీదేవి

**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

హైదరాబాద్, బషీర్‌బాగ్: బషీర్‌బాగ్‌లోని పి.జి. లా కాలేజీలో ఒక అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శ్రీమతి ఎ. శ్రీదేవి మాట్లాడుతూ, న్యాయ విద్య అంటే కేవలం చట్టంపై పరిజ్ఞానం పొందడం మాత్రమే కాదని, సమాజంలో న్యాయం, సమానత్వం మరియు రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత కూడా ఇందులో ఇమిడి ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక న్యాయ సూత్రాలతో పాటు న్యాయ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు, కొత్త చట్టాలు మరియు న్యాయపరమైన పరిణామాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆమె ప్రతి న్యాయ విద్యార్థికి సూచించారు. న్యాయ వృత్తిలో నిజాయితీ, నైతిక విలువలు, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యత అత్యంత కీలకమని ఆమె నొక్కి చెప్పారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు, న్యాయ సేవా శిబిరాలు, లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం మరియు వ్యాజ్యానికి పూర్వ పరిష్కార సేవలు (జూతీవ-శ్రీఙఅస్త్రుఁఆశీఅ ంవతీజఱఎవం) వంటి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. ర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు మరియు ఇతర అర్హులైన వారికి న్యాయ సహాయం అందించడంలో తమవంతు సహకారం అందించాలని ఆమె న్యాయ విద్యార్థులను మరియు న్యాయవాదులుగా మారాలనుకునే వారిని కోరారు. విద్యార్థి దశ నుండే ప్రజలతో మమేకమై, న్యాయపరమైన సమస్యలను అర్థం చేసుకుని, ప్రజలకు వారి హక్కులు మరియు న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కోర్టు విధానాలు, న్యాయ ప్రక్రియలు మరియు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాలపై ఆచరణాత్మక అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కూడా వారికి సలహా ఇచ్చారు.



## చవితి సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం

కామవరపుకోట, సెప్టెంబర్ 19: కామవరపుకోట శివారు కొత్తపేట బీసీ కాలనీలో వినాయక చవితి సందర్భంగా బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు అన్నదాతలైన బోళ్ల ప్రసాదు వారి తనయుడు లోకేష్ ను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్దలు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావనలో పెంపొందించేలా చిన్నారులకు అవగాహన చేయాలన్నారు. అన్ని వయసుల వారికి సరదానికి ఇచ్చే పండగ వినాయక చవితి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొండూరు సురేష్ , కామవరపుకోట మాజీ జడ్పిటిసి గంట సుధీర్ బాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు సాయన కనకరాజు, మాజీ ఎంపీటీసీ చిలుకూరి సుబ్బారావు , సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు, బిరుదు గడ్డ రాజేష్, బాల గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లి ఆదిత్యనగర్లో 19 రకాల గోదావరి రుచులతో అన్నసమారాదన

హైదరాబాద్, సెప్టెంబర్ 19: కేపీహెచ్‌బీ ఆదిత్యనగర్ పార్కు వద్ద వినాయకచవితి సందర్భంగా ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన వుయ్యూరు జగదీష్ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధాన నిర్వహించారు. హైదరాబాద్‌లో ప్రతి యేటా వినాయకచవితి సందర్భంగా జగదీష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిస్తారు. ఈ సారి భిన్నంగా 19 రకాల ఆంధ్రా గోదావరి రుచులతో ఆంధ్రాలోని నూజివీడుకు చెందిన ప్రముఖ వంటమేస్త్రీ పుల్లయ్య టీం ఆధ్వర్యంలో వంటలు చేయించి బంతిభోజనం పెట్టారు. 1500 మందికి పైగా భక్తులు ఈ అఖండ అన్నసమారాధానలో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో చాలా రోజుల తర్వాత 19 రకాల వంటలతో అద్భుతమైన గోదావరి రుచులతో బంతి భోజనంలో అన్నసమారాధన చేశారని ప్రశంసించారు. అన్న సమారాధనలో అన్నవరం ప్రసాద వితరణ చేశారు. అన్నసమారాధనలో దండోరా సినిమా నిర్మాత బెన్నీతో పాటు పలువురు సినీ, సీరియల్ ఆర్టిస్టుల పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో తొలిలడ్డూను నీలేష్ చోప్రా - లక్ష్మీస్పందన దంపతులు రు. 61 వేలు, రెండో లడ్డూను మందలపు హనుమంతు రు. 47 వేలు, మూడో లడ్డూను లోహిత్‌చారి రు. 20 వేలకు సొంతం చేసుకున్నారు.

# ఆయుర్వేదం.. ఆరోగ్యానికి అమృతధార

### ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఆయుర్వేదం కేవలం ఒక వైద్య విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించే భారతదేశ ప్రాచీన విజ్ఞాన సంపద అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర నిర్మాణానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు.

11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఆయుష్ శాఖ, డా. ఎన్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల, డా. ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, జిల్లా ఆయుష్ విభాగం, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆరోగ్యకర భవితకు ఆయుర్వేదం ఇతివృత్తంతో ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ.. డా. ఎన్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపల్ టి.బుల్లయ్య, డా. ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.జగదీష్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వేల సంవత్సరాలుగా ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం ఉందని.. ఆయుర్వేద ప్రాథమిక సూత్రం సమగ్ర ఆరోగ్య సంరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడంతో పాటు, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి, ప్రకృతితో అనుసంధానంగా జీవించడం వంటి అంశాలకు ఆయుర్వేదం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని.. దుష్పరిణామాలు లేని ఆయుర్వేదంలోని ఆరోగ్య సంరక్షణ సూత్రాలు, ఆహార నియమాలు వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజలు.. ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ఆయుర్వేదం వంటి భారతీయ ప్రాచీన వైద్య విజ్ఞాన సంపదకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని.. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, ఆయుర్వేద ఆసుపత్రుల సీనియర్ వైద్యాధికారులు, యూజీ, పీజీ విద్యార్థులు, సిబ్బంది, ఎన్‌టీఆర్ జిల్లా ఆయుష్ విభాగం వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బీరం లక్ష్మారెడ్డికి ఘన నివాళులు



కొల్లాపూర్, సెప్టెంబర్ 19

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మె ల్యేలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కేటీఆర్, మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు బీరం లక్ష్మారెడ్డి సేవలను స్మరించుకు న్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా నివాళుల కార్యక్రమంలో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాయకులు అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించారు. కుటుంబం ఎదు ర్కొంటున్న విషాద సమయంలో తమ మద్దతు ఉంటుం దని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులను ఓదారు స్తూ ధైర్యం చెప్పారు. బీరం లక్ష్మారెడ్డి మరణం కుటుం బానికి, సన్నిహితులకు తీరని లోటని నాయ కులు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు కూడా నివాళులర్పించారు. బీరం లక్ష్మారెడ్డి స్మృతులను గుర్తుచేసుకుంటూ కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు.



# పెళ్లైన 18 రోజులకే విషాదం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 19

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని పల్లవి మృతి విషాదాన్ని మిగిల్చింది. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న పల్లవి కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకిన ఘటన తీవ్ర కలకలం రేపింది. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మధుసూదన్ రెడ్డి కుమార్తె పల్లవికి ఈ ఏడాది ఆగస్టు 30న చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ రెడ్డితో వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహం జరిగిన కొద్ది రోజులకే కుటుంబంలో విభేదాలు తలెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లవి కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం అదనపు వరకట్నం కోసం ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించినట్లు పేర్కొన్నారు. ఈ వేధింపులను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన పల్లవి తాను చదువుతున్న కళాశాల భవనం నుంచి దూకినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టారు. గాయపడిన పల్లవిని తొలుత జీడిమెట్లలోని నీలిమ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మేడిపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి మార్చి వైద్యం అందించారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై పల్లవి తల్లి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. యువతి మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు షెడ్యూల్



నిర్మల్, సెప్టెంబర్ 19

